సాక్షి
పెద్దపల్లి
బుధవారం ׀ 28 ׀ జూన్ ׀ 2023



సెప్టెంబర్ తర్వాత ఎప్పుడైనా..!

సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలకు మరో ఏడాది పట్టే అవకాశం కనిపిస్తోంది. నిజానికి ఈ ఏడాది జూన్‌లో నోటిఫికేషన్ ఇచ్చి.. వచ్చే నెల ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. 8లో



మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ నాయకులు

పెద్దపల్లిరూరల్: సీఎం కేసీఆర్ మహారాష్ట్ర పర్యటనలో మంత్రి కొప్పుల, మండలి విప్ భానుప్రసాద్, జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, ఎమ్మెల్యేలు దాసరి, కోరుకంటి తదితరులు పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
30.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గోదావరి బ్రిడ్జిపై ఫెన్సింగ్ నిర్మించండి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ల ఫోరం నాయకులు

కోల్‌సిటీ: ఆత్మహత్యల నివారణకు గోదావరి బ్రిడ్జిపై ఫెన్సింగ్ నిర్మించాలని కార్పొరేషన్ ఫోరం నాయకులు కోరారు. ఈ మేరకు కమిషనర్ సుమన్‌రావుకు మంగళవారం వినతిపత్రం అందించారు. బ్రిడ్జిపై ఫెన్సింగ్ లేకపోవడంతో ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని తెలిపారు. పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థపు నీరు నేరుగా గోదావరిలో కలిసి జలాలు కలుషితం అవుతున్నాయని, ఆ నీటిని ప్రజలు తాగలేకపోతున్నారని పేర్కొన్నారు. కలుషితం కాకుండా ఎస్‌టీపీలను పునరుద్ధరించాలని కోరారు. ఫోరం అధ్యక్షుడు కన్నూరి సతీశ్ కుమార్, ప్రధాన కార్యదర్శి దాతు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మేకల సదానందం, ప్రధాన సలహాదారులు సాగంటి శంకర్, గణుముక్కుల తిరుపతి, నీల గణేష్, మీర్జా సలీం బేగ్ తదితరులు పాల్గొన్నారు.

'భవిష్యనిధి'పై అవగాహన



మాట్లాడుతున్న బీ థర్మల్ ఎస్ఈ విజేందర్

రామగుండం: భవిష్య నిధితో కలిగే లాభాలు, ప్రయోజనాలను స్థానిక బీ–థర్మల్ విద్యుత్ కేంద్రంలోని ఇంజినీర్ల సమావేశ మందిరంలో నిధి ఆప్‌కే నిఖత్ పేరుతో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బీ– థర్మల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ విజేందర్, నోడల్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఏనుగు మోహన్‌రెడ్డి ప్రయోజనాలను వివరించారు. ఉద్యోగులను ఆపద సమయంలో ఆదుకుంటుందని, లేనిపక్షంలో బహుళ ఆర్థిక ప్రయోజనాలు పొందవచ్చని సూచించారు. ఈపీఎఫ్ అధికారులు డి.రవికుమార్, అనిల్‌కుమార్, జెన్‌కో ఇంజినీర్లు, అధికారులు శంకరయ్య, బాలకృష్ణ, కృష్ణమూర్తి, సత్యశ్రీనివాస్, ఆరుముళ్ళ భూమయ్య తదితరులున్నారు.

'ఉపా' కేసులు ఎత్తివేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: ప్రజాసంఘాల నేతలపై కుట్రపూరితంగా నమోదు చేసిన ఉపా కేసులను వెంటనే ఎత్తివేయాలని అఖిలభారత రైతుకూలీ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద 'ఉపా' చట్టాలకు వ్యతిరేకంగా మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయని జిల్లా ప్రధాన కార్యదర్శి వెల్తురు సదానందం ఆరోపించారు. ప్రజాసంఘాల నేతలు విమలక్క, మోహనచంద్ర, సంధ్య, కోట శ్రీను, సమీర్, శిల్ప తదితరులపై ఉపా కేసులు మోపడం విచారకరమన్నారు. మావోయిస్ట్ పార్టీని సాకుగా చూపిస్తూ మేధావులు, ప్రజాసంఘాల నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. ప్రజాసంఘాల నాయకులపై అక్రమంగా మోపిన ఉపా కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మేరుగు చంద్రయ్య, కొల్లూరి మల్లేశ్, తిర్రి బాలకృష్ణ, వెంకటేశ్, రాజకొంరయ్య, రాంచంద్రంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం నిధులపై సీఎం తప్పుడు ప్రచారం



కరపత్రాలు పంచుతున్న రావుల రాజేందర్

గోదావరిఖని: కేంద్రం ఇస్తున్న నిధులపై సీఎం కేసీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్ అన్నారు. ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం అడ్డగుంటపల్లి ఏరియాలో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. కేంద్రప్రభుత్వ అభివృద్ధి పథకాలను వివరించారు. ఉచిత రేషన్, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.9వేలు, డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి రూ.3లక్షలు కేంద్రం ఇస్తున్నా.. తమ పథకాలేనని బీఆర్‌ఎస్ నాయకులు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. నాయకులు మాతంగి రేణుక, శ్రీధర్, శాంతరావు, మాడిశెట్టి వెంకటేశం, కార్తీక్, వడ్డేపల్లి రాంచందర్, మామిడి రాజేష్, బుంగ మహేష్ పాల్గొన్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న వెంచర్ జిల్లాకేంద్రం శివారు నిట్టూరు రోడ్డులోనిది. రియల్ భూమ్‌తో మున్సిపాలిటీలతోపాటు శివారులోని భూములకు సైతం రెక్కలొచ్చాయి. దీంతో పచ్చని పొలాలు వెంచర్లుగా మారుతున్నాయి. ముఖ్యంగా సుల్తానాబాద్‌–కరీంనగర్ రాజీవ్‌రహదారి వెంబడి పల్లెల్లో అక్రమంగా వ్యవసాయ భూములు రియల్ వెంచర్లుగా మారుతున్నాయి. రాజీవ్ రహదారికి ఆనుకుని ఉన్న గ్రామాలైన దుబ్బపల్లి, గర్రెపల్లి, నరసయ్యపల్లి, చిన్నకల్వల, సుగ్లంపల్లి, శ్రీరాములపల్లి, అరెపల్లి, పుసాల, యాదవనగర్, శాస్త్రినగర్ గ్రామాల్లో వ్యవసాయ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేసి అక్రమంగా వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాలా కన్వర్షన్ చేసుకోవాల్సి ఉండగా కొందరు మాత్రమే పర్మిషన్ తీసుకొని చదరపు గజాల చొప్పున ప్లాట్లు అమ్ముతున్నారు.

వెంచర్ల జోరు

అనుమతులు లేకుండానే ఏర్పాటు



ఈచిత్రంలో కనిపిస్తున్నది జిల్లాకేంద్రంలోని రంగంపల్లి వద్ద ఉన్న పాత రైస్ మిల్లు ప్రాంతం. దానిని కూల్చి.. ఇలా చదును చేసి వెంచర్‌గా మార్చారు. వాస్తవానికి నాలా కన్వర్షన్ చేసి లేఅవుట్ అనుమతి వచ్చిన తరువాతనే ప్లాట్లు చేయాలి. కానీ వ్యాపారులు ప్రైవేట్ ఇంజినీర్లు, సర్వేయర్ల సహకారంతో హద్దురాళ్లు, సిమెంట్ స్తంభాలు నాటుతున్నారు. రైస్‌మిల్లులకు కేరాఫ్‌గా ఉన్న పెద్దపల్లిలో గతంలో మూడు నుంచి ఐదు ఎకరాల్లో రైస్‌మిల్లులు నిర్మించారు. కొత్తగా జిల్లా ఏర్పడటం, పట్టణం రోజురోజుకూ విస్తరించడంతో ఆయా భూముల విలువ రూ.కోట్లకు చేరింది. దీంతో జనావాసాల మధ్య ఉన్న ఆయా రైస్‌మిల్లులను ఇప్పుడు కూల్చివేసి ప్లాట్లు చేస్తున్నారు. సదరు రైస్‌మిల్లులను వేరే ప్రాంతాలకు తరలిస్తున్నారు. పెద్దపల్లి నుంచి ధర్మారం వెళ్లే దారిలో గతంలో ఎకరం రూ.20లక్షలు ఉండగా.. చాలా రైస్‌మిల్లులు ఆ దారి వెంట తక్కువ ధరకు భూములు కొనుగోలు చేసి రైస్‌మిల్లులను తరలిస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ఇప్పుడు వ్యవసాయ భూముల ధరలకు రెక్కలొచ్చాయి.



పెద్దపల్లి శివారు బందంపల్లి వద్ద రైస్ మిల్లు కూల్చి వెంచర్ ఏర్పాటు

- నిబంధనలు ఉండవు.. అమ్మకాలు ఆగవు
- ఆదాయం కోల్పోతున్న జీపీలు, మున్సిపాలిటీలు

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో రియల్ వ్యాపారం జోరుగా సాగుతుండటంతో పల్లె, పట్టణం అనే తేడా లేకుండా అక్రమ లేఅవుట్లు జోరుగా వెలుస్తున్నాయి. అనధికార లేఅవుట్ స్థలాల్లో భవన నిర్మాణ అనుమతులు ఇవ్వకూడదని మున్సిపాలిటీ చట్టం 2019 చెబుతోంది. మరోవైపు లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్) భవిష్యత్తులో ఉండదని రాష్ట్ర పురపాలకశాఖ తేల్చి చెప్పింది. అయినా జిల్లావ్యాప్తంగా పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్, రామగుండం కార్పొరేషన్‌లతోపాటు వాటి శివారు పల్లెల్లో జోరుగా అక్రమ వెంచర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఫలితంగా పాలకవర్గాలు ఆదాయానికి రూ.కోట్లలో గండిపడుతోంది. వీటి వెనుక రాజకీయ అండదండలు ఉండడంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నాలా కన్వర్షన్ చేసి లే అవుట్ అనుమతి వచ్చిన తరువాతనే ప్లాట్లు తయారు చేయాలి. కానీ వ్యాపారులు ప్రైవేటు ఇంజినీర్లు, సర్వేయర్ల సహకారంతో హద్దురాళ్లు, సిమెంట్ స్తంభాలు పాతుతున్నారు. గజాల లెక్కన అమ్మాల్సిన ప్లాట్లను గుంటల చొప్పున ఫామ్ ల్యాండ్స్ పేరుతో విక్రయిస్తున్నారు. ప్లాట్లు కొనుగోలు చేసిన తర్వాత వినియోగదారులు ఇబ్బందుల పాలవుతున్నారు. అనధికార వెంచర్లతో 10 శాతం భూమిని మున్సిపాలిటీ, జీపీల పేరిట కేటాయించడం లేదు. దీంతో భవిష్యత్తులో మరిన్ని కొత్త సమస్యలతోపాటు రిజిస్ట్రేషన్ శాఖకు ఆదాయం కోల్పోతోంది. గ్రామాల్లో వెలిసిన వాటిలో ఎనిమిది వెంచర్లకు, రామగుండంలో 4, పెద్దపల్లిలో మూడు, మిగిలిన మున్సిపాలిటీల్లో వెలిసిన వాటికి అనుమతులు లేకుండానే జోరుగా సాగుతున్నా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు సర్వత్రా నెలకొన్నాయి.

చర్యలు తీసుకుంటాం

అధికారికంగా లే అవుట్లు చేసి, స్థలాలు విక్రయిస్తే ఇబ్బందులు ఉండవు. ప్రభుత్వ అనుమతులు పొంది వెంచర్లు ఏర్పాటు చేసుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు చేసే సంబంధిత వ్యాపారులపై తగిన చర్యలు తీసుకుంటాం. అటువంటి వాటికి ఇప్పటికే నోటీసులు ఇచ్చాం.

– అవినాష్, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్

నిబంధనలు ఇలా..

- వ్యవసాయభూమిలో లేఅవుట్ చేయాలంటే మొదట భూమి విలువలో మూడు శాతం రుసుంను రెవెన్యూ శాఖకు చెల్లించి నాలా (వ్యవసాయేతర భూమి)గా మార్చుకోవాలి. తర్వాత డీటీపీసీ నుంచి అనుమతులు పొంది లేఅవుట్లు వేసుకోవాలి.
- పట్టణాల్లో మున్సిపల్, గ్రామాల్లో పంచాయతీల అనుమతి తీసుకోవాలి. జిల్లాస్థాయిలో డీటీసీపీ నుంచి లేవుట్ అనుమతి తీసుకోవాలి.
- వెంచర్‌లో పదిశాతం ఆయా జీపీలు, మున్సిపాలిటీలకు అప్పగించాల్సి ఉంటుంది.
- వీధిదీపాల ఏర్పాటు, రహదారులు, నీటిట్యాంకు, ఆలయాలు, తదితర నిర్మాణాలను నిర్వాహకులే చేపట్టాల్సి ఉంటుంది. జిల్లాలో వీటన్నింటికీ విరుద్ధంగా లేఅవుట్ చేస్తున్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సంగీత, అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్

గ్రూప్‌–4 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ సంగీత వెల్లడి
- 43 కేంద్రాలు, 17,927 మంది అభ్యర్థులు
- గ్రూప్‌–4 పరీక్ష ఏర్పాట్లపై సమీక్ష

పెద్దపల్లిరూరల్: జూలై ఒకటిన జరిగే గ్రూప్‌–4 పరీక్ష నిర్వహణకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, పరీక్ష ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేలా చూడాలని కలెక్టర్ సంగీత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్‌తో కలిసి గ్రూప్‌–4 పరీక్ష నిర్వహణపై సమీక్షించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండో పేపర్ పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 17,927మంది అభ్యర్థులు హాజరుకానున్నారని, వీరికోసం 43 కేంద్రాలను గుర్తించామని వివరించారు.

వసతులు తప్పనిసరి

లైజనింగ్, చీఫ్ సూపరింటెండెంట్ అధికారులు పరీక్ష కేంద్రాలను సందర్శించి తాగునీరు, విద్యుత్, సీసీ కెమెరాల ఏర్పాట్లను పరిశీలించాలన్నారు. వైద్యసేవలతోపాటు కేంద్రాలవద్ద పోలీస్ బందోబస్తు ఉంచాలన్నారు. ప్రతి 24 మంది అభ్యర్థులకు ఒక ఇన్విజిలేటర్‌ను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు.

పావుగంట ముందే గేటు మూసివేత

అభ్యర్థులు పావుగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, తర్వాత వచ్చే వారిని లోనికి అనుమతించబోరని కలెక్టర్ స్పష్టం చేశారు. ఉదయం పరీక్షకు 8 నుంచి 9.45గంటలవరకు, మధ్యాహ్నం పరీక్షకు ఒంటి గంట నుంచి 2.15 వరకు కేంద్రాల్లోకి అనుమతిస్తామన్నారు. సమావేశంలో జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

సీఎమ్మార్ షురూ చేయండి

- ఇంకా మొదలు పెట్టని 135 మిల్లులు
- జూలై ఒకటి వరకు ఆరంభించకుంటే చర్యలు
- అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ

పెద్దపల్లిరూరల్: జిల్లాలో సీఎమ్మార్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) డెలివరీని వెంటనే ప్రారంభించాలని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ మిల్లర్లను ఆదేశించారు. ఇప్పటివరకు జిల్లాలో 135 రైస్‌మిల్లులు డెలివరీ ప్రారంభించలేదని, వారంతా వచ్చేనెల ఒకటి వరకు ఆరంభించాలని తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీఎమ్మార్ రైస్ డెలివరీపై సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లతో మంగళవారం సమీక్షించారు. రైస్ మిల్లుల్లో పూర్తి సామర్థ్యం మేర మిల్లింగ్ చేయాలని, లక్ష్యం మేరకు డెలివరీ చేయాలని సూచించారు. గత వానాకాలం పంటకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సీఎమ్మార్ డెలివరీకి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎఫ్‌సీఐ అధికారులతో సమస్యలుంటే పరిష్కరించేందుకు సహకరిస్తామని వెల్లడించారు. పౌర సరఫరాల శాఖ టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ ప్రభాకర్, జిల్లా పౌర సరఫరాల అధికారి తోట వెంకటేష్, డిప్యూటీ తహసీల్దార్లు, మిల్లర్లు పాల్గొన్నారు.

విచారణకు హాజరైన కమిషనర్ రవీంద్ర



విచారణకు హాజరైన ఎస్.రవీంద్ర

కోల్‌సిటీ: రామగుండం కార్పొరేషన్‌లో ఓ అభివృద్ధి పనిచేయకున్నా బిల్లు చెల్లించారని వచ్చిన ఫిర్యాదుల మేరకు అప్పుడు కమిషనర్‌గా పనిచేసిన ఎస్.రవీంద్రపై సీడీఎంఏ అధికారులు విచారణ జరిపించారు. ఈ కేసులో మంగళవారం మరోసారి విచారణ జరిగింది. విచారణ అధికారి హోదాలో ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ శైలజ రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయానికి వచ్చారు. అలాగే గతంలో పనిచేసిన ఎస్.రవీంద్ర హాజరయ్యారు. ఆయన ద్వారా శైలజ వివరాలు సేకరించారు. అప్పటి రికార్డులను పరిశీలించారు. మున్సిపల్ ఆర్‌ఓ రాజలింగు పాల్గొన్నారు.

ఉలిక్కిపడ్డ ఉమ్మడి జిల్లా

- రామగుండంలో తండ్రీకూతురిని అదుపులో తీసుకున్న ఏటీఎస్
- ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయని ఆరోపణలు
- విచారణ నిమిత్తం హైదరాబాద్‌కు తరలింపు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో గుజరాత్ పోలీసులు రామగుండంలో తండ్రీకూతురిని అదుపులోకి తీసుకోవడం కలకలం సృష్టించింది. ఇటీవల శ్రీనగర్ కు చెందిన నలుగురు ఇస్లామిక్ స్టేట్ సానుభూతిపరులను గుజరాత్ యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్ (ఏటీఎస్) అరెస్టు చేశారు. వారిలో సమేరా బాను అనే మహిళతో తెలంగాణలో పలువురు చాటింగ్ చేసినట్లు గుర్తించిన ఏటీఎస్ పోలీసులు పాతబస్తీతో పాటు వివిధ ప్రాంతాల్లో మంగళవారం దాడులు నిర్వహించారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటూ సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా పనిచేస్తున్న తండ్రి(40), కూతురు (20) నాలుగు రోజుల క్రితం గోదావరిఖని శ్రీనగర్ కాలనీలోని బంధువుల ఇంట్లో షెల్టర్ తీసుకున్నారు. దీంతో గుజరాత్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని రామగుండం సీపీ ఎదుట హాజరుపరిచారు. ఉగ్రవాదులతో సంబంధాలపై విచారించినట్లు సమాచారం. మీకు సమేరా భాను ఎలా పరిచయం? ఎన్ని రోజుల నుంచి తెలుసు? వారితో ఏంచాట్ చాట్ చేశారు? తదితర అంశాలపై ప్రశ్నించి స్టేట్‌మెంట్ రికార్డ్ చేశాక, హైదరాబాద్ తరలించారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటే



పాదయాత్రలో మాట్లాడుతున్న విజయరమణారావు

- రాష్ట్రంలో హామీలు విస్మరించి మహారాష్ట్రలో ఏం చేస్తారో..?
- కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రెండు లక్షల ఉద్యోగాల భర్తీ
- టీ పీసీసీ ఉపాధ్యక్షుడు విజయరమణారావు

సుల్తానాబాద్: కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ రెండూ ఒక్కటేనని టీపీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు అన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదుగానీ.. మహారాష్ట్రలో ఏదో చేస్తానని సీఎం కేసీఆర్ బయల్దేరడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. పట్టణంలోని 15వ వార్డులో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో మాట్లాడారు. రాష్ట్రంలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ప్రకటించి ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఖాళీగా ఉన్న రెండు లక్షల పోస్టులు భర్తీ చేస్తామన్నారు. రైతులకు రుణమాఫీ చేయకపోవడంతో కొత్త రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకురావడం లేదన్నారు. కార్యక్రమంలో 15వార్డ్ ఇన్‌చార్జి గాజుల రవి, పట్టణ అధ్యక్షుడు వేగోళం అబ్బయ్యగౌడ్, మాజీ సర్పంచులు అంతటి అన్నయ్య గౌడ్, మినుపాల ప్రకాశ్ రావు, దన్నాయక్, దామోదర్‌రావు, మండల అధ్యక్షుడు చిలుక సతీశ్, ఏఎంసీ మాజీ చైర్మన్ సాయిరి మహేందర్, కుమార్ కిషోర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మహిళా ఠాణాకు మోక్షమెప్పుడు?

- రామగుండంలో ఏర్పాటు చేస్తామన్న హోంమంత్రి మహమూద్ అలీ
- అమలుకు నోచుకోని వైనం
- జిల్లాలో పెరుగుతున్న గృహహింస కేసులు
- సగానికి పైగా సమయం కౌన్సెలింగ్‌కే..
- ఇతర నేరాలూ అధికమవుతుండటంతో పోలీసులపై భారం



గోదావరిఖని పాత వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ భవనంలో ఏర్పాటు చేయనున్న మహిళా ఠాణా

'రామగుండంకు చెందిన ఓ మహిళ తన భర్త వేధింపులను తట్టుకోలేక పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది. నెలలు గడిచినా సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. ఠాణా పరిధిలో నేర సంబంధ కేసులు ఎక్కువగా నమోదు కావడం వల్ల గృహహింస కేసుల పరిష్కారం ఆలస్యమవుతోంది.' ఈ ఒక్క చోటనే కాదు పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా గృహహింస పెరిగిపోయి, అధిక సంఖ్యలో బాధితులు పోలీస్‌స్టేషన్లను ఆశ్రయిస్తున్నారు. ఫ్యామిలీ కౌన్సెలింగ్ కోసం జిల్లాలో మహిళా పోలీస్‌స్టేషన్ లేకపోవడంతో మహిళలు ఇబ్బంది పడుతున్నారు.

గోదావరిఖని(రామగుండం): జిల్లాలో ఇటీవలి కాలంలో మహిళలపై వేధింపులు ఎక్కువవుతున్నాయి. బాధితుల ఫిర్యాదులతో కేసుల సంఖ్య పెరుగుతోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఒక్క కరీంనగర్‌లోనే మహిళా పోలీస్‌స్టేషన్ ఉంది. దూరంగా ఉన్న అక్కడికి వెళ్లలేక చాలామంది న్యాయం కోసం సమీపంలోని ఠాణాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో పోలీసులపై భారం పెరుగుతోంది. పెద్దపల్లి జిల్లాలో మహిళా వేధింపు కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఫ్యామిలీ కౌన్సెలింగ్‌కు అధిక సమయం కేటాయించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఇతర నేరాలు పెరిగిపోవడం, వాటిపై దృష్టిసారించడానికి ఎక్కువ సమయం కేటాయిస్తుండటంతో గృహహింస కేసులు పెండింగ్‌లో ఉంటున్నాయి.

జిల్లాలో నమోదైన గృహహింస కేసులు

2020	405
2021	435
2022	476
2023 మే	126

రామగుండంలో మూడు రెట్లు అధికం

నేరాలు ఎక్కువగా జరిగే రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో మహిళా వేధింపుల కేసులు మూడు రెట్లు నమోదవుతున్నాయి. ఇది పోలీసులకు తలకుమించిన భారంగా మారింది. రోజుకు ఒక మహిళా వేధింపుల కేసు వస్తే ఆ రోజంతా దానికే కేటాయించాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. ఇంత చేసినా ఇరువర్గాలను సంతృప్తిపర్చే పరిస్థితి ఉండటం లేదని అంటున్నారు. దీంతో చాలా క్రైం కేసులు పెండింగ్‌లో ఉంటున్నాయని చెబుతున్నారు. సిబ్బంది కొరత, ప్రత్యేకంగా సమయం కేటాయించలేకపోవడం వల్ల ఫిర్యాదుల పరిష్కారం కోసం మహిళలు ఠాణాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సిన వస్తోందని పేర్కొంటున్నారు. మహిళల భద్రత కోసం పోలీసులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ గృహహింస, వరకట్న వేధింపులను అడ్డుకోలేక పోతున్నారని పలువురు అంటున్నారు.

హోం మంత్రికి ఎమ్మెల్యే వినతి..

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో మహిళా పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీని కోరారు. ఇటీవల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి వచ్చిన ఆయనకు వినతిపత్రం అందించారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలోనే మహిళా ఠాణా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పాత భవనానికి మహిళా పోలీస్‌స్టేషన్ పేరు పెట్టినప్పటికీ కార్యకలాపాలు సాగడం లేదు. కోల్‌బెల్ట్ ప్రాంతంలో పెరుగుతున్న మహిళా వేధింపు కేసులను దృష్టిలో పెట్టుకొని, సాధ్యమైనంత త్వరగా మహిళా పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సఖీ కేంద్రాల్లో కౌన్సెలింగ్

పెద్దపల్లిలో కలెక్టరేట్ సముదాయానికి ఎదురుగా సఖీ కేంద్రం నిర్వహిస్తున్నారు. గృహహింస, వరకట్న వేధింపులను ఎదుర్కొంటున్న మహిళలకు న్యాయం చేసేందుకు పోలీసులు జిల్లా కేంద్రాల్లో ఉన్న సఖీ కేంద్రాలతో సమన్వయం చేస్తున్నారు. ఇలాంటి కేసుల్లో ఇరువర్గాల వారిని కౌన్సెలింగ్ కోసం అక్కడికి పంపుతున్నారు. ఇది పూర్తిస్థాయిలో సత్ఫలితాలను ఇవ్వడం లేదు. బాధితులు తిరిగి పోలీస్‌స్టేషన్‌లోనే కేసు పెడుతున్నారు.

క్లుప్తంగా

పండుగలకు పటిష్ట బందోబస్తు



గోదావరిఖని(రామగుండం): బక్రీద్, ఏకాదశి, బోనాల జాతరకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని రామగుండం సీపీ రెమా రాజేశ్వరి ఆదేశించారు. 29న బక్రీద్ సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీ, కార్పొరేషన్ అధికారులు శాంతికమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. 29న ఏకాదశి, జూలై 22 వరకు జిల్లాతోపాటు మంచిర్యాలలో బోనాల జాతర ఉంటుందని, ప్రజలకు ఇబ్బంది కలగనీయొద్దని సూచించారు. పశువులను అక్రమంగా రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బసంత్‌నగర్ టోల్‌గేట్, మంథనిలోని ఎక్లాస్‌పూర్, మంచిర్యాలలో రేపల్లెవాడ, ఐబీతాండూర్, కోటపల్లి, లక్సెట్టిపేటలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. పశువుల అక్రమ రవాణా జరిగే ప్రాంతాల్లో పెట్రోలింగ్ చేపట్టాలన్నారు.

సమస్యలు సృష్టించేవారిపై నిఘా

మత ఘర్షణలు కలిగేలా సమస్యలు సృష్టించేవా రిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని సీపీ పేర్కొన్నారు. సోషల్ మీడియాలో మతాలు, కులాలను కించపరిచినా.. పుకార్లను వ్యాప్తి చేసినా చర్యలు తప్పవన్నారు. సోషల్ మీడియాపై మానిటరింగ్ సెల్ నిఘా ఉంటుందన్నారు.

సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లిరూరల్: సివిల్స్ లాంగ్‌టర్మ్ ఫ్రీ కోచింగ్‌కు అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ, బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించే కోచింగ్(ప్రిలిమ్స్ కం మెయిన్స్)కు పెద్దపల్లి జిల్లాకు చెందిన డిగ్రీ పాసైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు జూలై 10లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 50 మందిని నేరుగా, 100 మందిని ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ఎంపిక చేస్తారన్నారు. లాడ్జింగ్, బోర్డింగ్, రవాణా కోసం నెలకు రూ.5 వేలు చెల్లిస్తారని పేర్కొన్నారు. అలాగే ప్రవేశం పొందిన అభ్యర్థులకు రూ.5 వేల విలువైన స్టడీ మెటీరియల్ అందిస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు 040–27077929, 7780359322 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జ్యోతిభవన్‌కు చేరుకున్న సీఐఎస్‌ఎఫ్ డీఐజీ నందన్

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు దక్షిణ ప్రాంత సీఐఎస్‌ఎఫ్ డీఐజీ నందన్ మంగళవారం రాత్రి పీటీఎస్‌లోని జ్యోతిభవన్‌కు చేరుకున్నారు. హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గం ద్వారా వచ్చిన ఆయనకు సీఐఎస్‌ఎఫ్ అధికారులు ఘన స్వాగతం పలికారు. బుధవారం మల్కాపూర్ రోడ్డులోని బ్యారక్స్‌లో జరగనున్న కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. అనంతరం ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టును సందర్శించి, భద్రతా చర్యలపై సమీక్షించనున్నారు.

సెప్టెంబర్ తర్వాత ఎప్పుడైనా..!

- సింగరేణిలో గుర్తింపు ఎన్నికలపై హైకోర్టు ఆదేశం
- ఎన్నికల నిర్వహణకు మరో ఏడాది పట్టే చాన్స్
- అసెంబ్లీ ఎన్నికల తర్వాత బొగ్గు ఉత్పత్తి కీలకం
- వచ్చే ఏడాది జూన్ వరకూ ఆగాల్సిందే..



సింగరేణి కార్మికులు

గోదావరిఖని: సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలకు మరో ఏడాది పట్టే అవకాశం కనిపిస్తోంది. నిజానికి ఈ ఏడాది జూన్‌లో నోటిఫికేషన్ ఇచ్చి.. వచ్చే నెల ఎన్నికలు నిర్వహిస్తామని డిప్యూటీ రీజినల్ లేబర్ కమిషనర్ శ్రీనివాస్ నిర్ణయించారు. అయితే ఎన్నికల నిర్వహణకు తాము సిద్ధంగా లేమని పేర్కొంటూ యాజమాన్యం కోర్టును ఆశ్రయించింది. దీంతో హైకోర్టు సెప్టెంబర్ ఒకటి తర్వాత ఎప్పుడైనా ఎన్నికలు నిర్వహించుకోవచ్చని ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలోనే ఈనెల 24న కార్మిక సంఘాల భేటీ కూడా రద్దయ్యింది. అయితే సెప్టెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ఊపందుకోనుంది. ఆ సమయంలో సింగరేణిలో గుర్తింపు ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావడం తక్కువే. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయి.. నూతన ప్రభుత్వం ఏర్పాటయ్యేవరకు జనవరి మొదటివారం వస్తుంది. జనవరి నుంచి మార్చి వరకు సింగరేణికి బొగ్గు ఉత్పత్తికి కీలక సమయం. అంతేకాకుండా విద్యుత్ వినియోగదారుల నుంచి బొగ్గు కోసం డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో ఎన్నికలు నిర్వహిస్తే బొగ్గు ఉత్పత్తిపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. దీంతో అప్పుడు ఎన్నికల నిర్వహణకు సింగరేణి యాజమాన్యం ఒప్పుకోకపోవచ్చు. అంటే మరో మూడు నెలలు ఆగి జూన్(2024)లో గుర్తింపు ఎన్నికలకు అవకాశం లభించనుంది. అదే జరిగితే గుర్తింపు యూనియన్ టీబీజీకేఎస్‌కు మంచి అవకాశం లభిస్తున్నప్పటికీ.. మిగితా జాతీయ కార్మిక సంఘాలు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి. సకాలంలో ఎన్నికలు నిర్వహించాల్సిన యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వ మద్దతుతో కావాలనే ఎన్నికల ప్రక్రియ ఆలస్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలో గతంలో ఎన్నికల కోసం కోర్టుకు వెళ్లిన ఏఐటీయూసీ ఎన్నికల జాప్యంపై మరోసారి కోర్టుకు వెళ్లేందుకు సిద్ధమవుతోంది. ఎన్నికలు నిర్వహించే వరకూ ప్రస్తుత గుర్తింపు రద్దు చేసి అందరికీ అవకాశం కల్పించాలని కోరనుంది. గుర్తింపు సంఘం ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా ఒకే చెబుతున్న యూనియన్లు అప్పటివరకు మాత్రం ప్రస్తుతం ఉన్న గుర్తింపును రద్దు చేసి టీబీజీకేఎస్‌తోపాటు అన్ని జాతీయ సంఘాలను చర్చలకు ఆహ్వానించాలని డిమాండ్ చేస్తున్నాయి. దీనిపై యాజమాన్యం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

కోలిండియా ఒప్పందాలు కావాలి



కోలిండియాలో ఎన్నికలు లేకున్నా యాజమాన్యం, ప్రభుత్వాల మెడలు వంచి హక్కులు సాధించుకుంటున్నాం. సింగరేణిలో ఎన్నికలు ఉన్నా కోలిండియా ఒప్పందాలు అమలు కావడం లేదు. హైపవర్ కమిటీ వేతనాలు, పెర్క్స్‌పై ఇన్‌కం టాక్స్ చెల్లింపు, క్యాడర్‌స్కీం, హెచ్‌ఆర్‌ఏ అందించడం లేదు. – **తుమ్మల రాజారెడ్డి, సీఐటీయూ అధ్యక్షుడు**

అధికార పార్టీకి యాజమాన్యం వత్తాసు



సింగరేణిలో గుర్తింపు ఎన్నికలను యాజమాన్యం కావాలనే జాప్యం చేస్తోంది. అధికార పార్టీకి వత్తాసు పలుకుతోంది. మేం కోర్టుకు వెళ్లి ఎన్నికలకు ఆదేశాలు తెస్తే.. యాజమాన్యం కోర్టును ఆశ్రయించి 3 నెలల గడువు తెచ్చుకుంది. ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా అన్ని యూనియన్‌లకు సమాన అవకాశం ఇవ్వాలి.
– **వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి**

కలెక్టర్ల లేఖతో కోర్టుకు..



రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలపై కసరత్తు ప్రారంభంకావడంతో సింగరేణి ఎన్నికలకు సిబ్బందిని ఇవ్వలేమని కలెక్టర్లు లేఖ రాశారు. వాస్తవాలను వివరిస్తూ హైకోర్టుకు వెళ్లాం. సెప్టెంబర్ ఒకటి తర్వాత ఎన్నికలు నిర్వహించుకోవచ్చని సూచించింది. ఎన్నికలు జరిపేవరకూ అందరికీ అవకాశం కల్పిస్తాం.
– **బలరాం, సింగరేణి డైరెక్టర్(పా)**

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కుడిదుల రాజేందర్(38) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. హమాలీ పనులు చేసే రాజేందర్‌కు భార్య రమ, కూతురు ఉన్నారు. అతను ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఇంటినుంచి బయల్దేరి కొలనూర్ వైపు వెళ్లేదారిలో వ్యవసాయ బావి పక్కన చెట్టుకు సర్వీస్ వైరుతో ఉరేసుకున్నాడు. అది తెగిపోవడంతో బావిలో పడి మృతిచెందాడు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతకగా మంగళవారం బావిలో అతని మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని..

పెద్దపల్లి పట్టణంలోని కొంతం వాడకు చెందిన జిల్లెల్ల సాయికుమార్(27) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మందమర్రికి చెందిన అనూషతో సాయికుమార్‌కు వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. సాయికుమార్ మద్యానికి బానిసయ్యాడని, ఎంత చెప్పినా మారడం లేదని అనూష మూడేళ్ల క్రితం పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో కొన్నిరోజుల క్రితం అత్తగారింటికి వెళ్లిన సాయికుమార్ కుమారుడిని తన వెంట తీసుకువచ్చాడు. భార్య కాపురానికి రావడం లేదని జీవితంపై విరక్తి చెంది, మంగళవారం ఉరేసుకున్నాడు. మృతుడి తల్లి విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదుపుతప్పి కెనాల్‌లోకి దూసుకెళ్లిన టిప్పర్

- డ్రైవర్‌కు గాయాలు
- బసంత్‌నగర్ విమానాశ్రయం సమీపంలో ఘటన



కాలువలో కూరుకుపోయిన టిప్పర్ ముందుభాగం

పాలకుర్తి(రామగుండం): ఓ టిప్పర్ అదుపుతప్పి ఎస్సారెస్పీ కాలువలోకి దూసుకెళ్లిన ఘటన బసంత్‌నగర్ విమానాశ్రయ సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జయ్యారం గ్రామ శివారులోని బండరాయి క్వారీల నుంచి మంగళవారం తెల్లవారుజామున టిప్పర్ బండ లోడ్‌తో కన్నాల బోడగుట్ట వద్ద గల స్టోన్ క్రషర్‌కు వెళ్తోంది. మార్గమధ్యలో బసంత్‌నగర్ విమానాశ్రయం సమీపంలోని మూలమలుపు వద్ద ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి, ఎస్సారెస్పీ కాలువలోకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో లారీ ముందుభాగం నుజ్జునుజ్జయింది. గమనించిన స్థానికులు బసంత్‌నగర్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న కానిస్టేబుల్ శివకుమార్ విద్యుత్ వైర్లు తెగిపడి ఉండటాన్ని గమనించి, ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోకుండా విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించి, బసంత్‌నగర్, కుర్మపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయించారు. ఈ ప్రమాదంలో గాయపడిన డ్రైవర్ రవిని 108 వాహనంలో పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రొక్లెయిన్ సహాయంతో బండరాళ్లను తొలగించి, లారీని కాలువలో నుంచి బయటకు తీశారు. కాగా గతంలోనూ ఇదే స్థలంలో ప్రమాదాలు జరిగి, పలువురు చనిపోగా, కొందరు గాయపడినట్లు స్థానికులు తెలిపారు. రోడ్డుపై మూలమలుపు ఉండటం, ఎలాంటి సైన్ బోర్డులు లేకపోవడంతో వాహనదారులు నేరుగా వెళ్లి, కాలువలో పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, సైన్‌బోర్డులు, వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

బొగ్గుబాయి వార్తలు

కార్పొరేట్ ప్లానింగ్ జీఎంకు సన్మానం



కొండయ్యను సన్మానిస్తున్న జీఎం, అధికారులు

కమాన్‌పూర్(రామగిరి): సింగరేణిలో జనరల్ మేనేజర్(ప్రాజెక్టు మేనేజర్)గా విధులు నిర్వహిస్తున్న కె.కొండయ్య ఈ నెల 30న ఉద్యోగ విరమణ పొందుతున్నారు. ఈ సందర్భంగా ఆర్జీ–3 జీఎం కార్యాలయంలో మంగళవారం ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆర్జీ–3 జీఎం ఎస్.సుధాకర్‌రావు, అధికారులు ఆయనను సత్కరించారు. కొండయ్య సింగరేణిలో వివిధ పదవుల్లో 40 ఏళ్లపాటు విధులు నిర్వహించి, మంచి గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. ఏపీఏ ఇన్‌చార్జి జీఎం బైద్య, అధికారులు ఎలిషా, సీతారామం, రఘుపతి, రాధాకృష్ణ, నరేందర్, రమేశ్, జైనులాబద్దిన్, వెంకటరమణ, చంద్రశేఖర్, విలాస్ శ్రీనివాస్ పోద్దార్, కర్ణ, ఐలయ్య, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, నాగేశ్వర్‌రావు, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఆర్జీ–2 జీఎం కార్యాలయంలో..

గోదావరిఖని(రామగుండం): కార్పొరేట్ ప్రాజెక్టు ప్లానింగ్ జీఎం కె.కొండయ్య ఈ నెల 30న ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆర్జీ–2 జీఎం కార్యాలయంలో ఆయనను జీఎం మనోహర్ శాలువాతో సన్మానించి, జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి మధుసూదన్, ఇన్‌చార్జి ఎస్‌వోటూ జీఎం బి.రవీందర్, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, డీజీఎం రాజేంద్రప్రసాద్, వర్క్‌షాప్ డీజీఎం ఎర్రన్న, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ, సీనియర్ సెక్యూరిటీ అధికారి పీవీ రమణ పాల్గొన్నారు.

పనులు పెండింగ్ లేకుండా చూడాలి



మాట్లాడుతున్న జీఎం సుధాకర్‌రావు



సమావేశమైన పర్సనల్ విభాగం అధికారులు

- పర్సనల్ విభాగం అధికారులతో ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు

కమాన్‌పూర్(రామగిరి): ఆర్జీ–3 ఏరియా పర్సనల్ విభాగంలో పనులు పెండింగ్ లేకుండా చూడాలని జీఎం కె.సుధాకర్‌రావు అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో పర్సనల్ విభాగం అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల గ్రీవెన్స్, ఐఆర్, క్వార్టర్స్, గృహనిర్మాణాలపై లోన్ ఇవ్వడం, ఉద్యోగ విరమణ పొందినవారికి మెడికల్ కార్డులు, డిపెండెంట్ ఉద్యోగాలు ఇవ్వడం తదితర అంశాలపై చర్చించారు. ఉద్యోగులు ఏవైనా సమస్యలపై దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి, పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో అధికారులు రఘుపతి, రాధాకృష్ణ, నరేందర్, విలాస్ శ్రీనివాస్ పోద్దార్, చంద్రశేఖర్, పద్మరాజు, మారుతి, రవీందర్‌రెడ్డి, రాజేశం, సునీల్ ప్రసాద్, మురళి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం వ్యవహరించాలి

గోదావరిఖని(రామగుండం): పర్సనల్ విభాగంలో పెండింగ్ ఫైల్స్ లేకుండా చూడాలని ఆర్జీ–1, 2 డీజీఎంలు లక్ష్మీనారాయణ, రాజేంద్రప్రసాద్ సూచించారు. మంగళవారం రెండు ఏరియాల్లో వేర్వేరుగా పర్సనల్ విభాగం అధికారులతో పలు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్ కోర్టు కేసులు, సీఎంపీఎఫ్, హెచ్‌బీఎల్‌ఆర్‌ఎస్, మెడికల్ కార్డ్స్, క్వార్టర్ల కేటాయింపు, ఉద్యోగుల క్రమశిక్షణ చర్యలు, నామినేషన్ ఫాంలను పూర్తి చేయించడం, డిపెండెంట్ ఎంప్లాయిమెంట్ సమయంలో పేర్లు పంపించేటప్పుడు కచ్చితంగా నిబంధనల ప్రకారం వ్యవహరించాలన్నారు.

యువకుడి ఇంటి ఎదుట యువతి బైఠాయింపు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలంలోని చిన్నబొంకూర్‌కు చెందిన ఆర్నకొండ శంకర్ తనను మోసం చేశాడని ఓ యువతి మంగళవారం అతని ఇంటి ఎదుట బైఠాయించింది. బాధితురాలి వివరాల ప్రకారం.. ధర్మారం మండలంలోని నర్సింగాపూర్‌కు చెందిన యువతి, శంకర్ కరీంనగర్‌లో డిగ్రీ చదువుతున్న సమయంలో పరిచయమయ్యారు. ఇద్దరూ ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకోవాలని యువతి కోరగా జాబ్ వచ్చిన తర్వాత చేసుకుంటానని నమ్మించాడు. తర్వాత అతను మరో అమ్మాయితో నిశ్చితార్థం చేసుకున్నట్లు తెలుసుకున్న బాధితురాలు తనకు న్యాయం చేయాలంటూ శంకర్ ఇంటి ఎదుట బైఠాయించింది. ఆమెకు పలువురు మహిళలు మద్దతు తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన నలుగురిపై కేసు

మంథని: అధికారుల విధులకు ఆటంకం కలిగించిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు మంథని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మంథని మున్సిపాలిటీ పరిధి సత్యసాయినగర్‌లో మున్సిపల్ లీజు ప్లాట్‌లో అనుమతి లేకుండా, హైకోర్టు ఆదేశాలను ధిక్కరించి అక్రమ నిర్మాణం చేపట్టిన విషయమై మున్సిపల్ టాస్క్‌ఫోర్స్ టీం ఈ నెల 23న అక్కడికి వెళ్లింది. లీజుదారుతోపాటు మరో ముగ్గురు వ్యక్తులు అధికారుల విధులకు ఆటంకం కలిగించారని మున్సిపల్ కమిషనర్ శారద పోలీసులకు ఫిర్యాదు చేశారు. లీజుదారు భీమయ్య ఒంటిపై కిరోసిన్ పోసుకొని, ఆత్మహత్యాయత్నం చేయగా వడ్లకొండ స్వరూప, జ్యోతి, సందీప్ తమను అడ్డుకున్నారని పేర్కొన్నారు.మీ మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ కేసు నమోదు విషయం ఆలస్యంగా తెలిసింది.

'మైనారిటీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోండి'

పెద్దపల్లిరూరల్: తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్‌లో యూపీఎస్సీ సీఎస్‌ఏటీ–2024 పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు మైనారిటీ సంక్షేమశాఖ జిల్లా అధికారి మెహరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు జూలై 13లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 100 మందికి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మహిళా అభ్యర్థులకు 33 శాతం సీట్లు, అన్ని రిజర్వ్‌డ్ కేటగిరీల్లో దివ్యాంగులకు 3 శాతం సీట్లు కేటాయిస్తారన్నారు. ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు 040–23236112 ఫోన్ నంబర్‌లో పని దినాల్లో సంప్రదించాలని సూచించారు.

ఈపీ ఆపరేటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించాలి



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణిలో పని చేస్తున్న ఈపీ ఆపరేటర్లు, ఎలక్ట్రిషియన్లకు వెంటనే కౌన్సెలింగ్ నిర్వహించాలని హెచ్‌ఎంఎస్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలోని హెచ్‌ఎంఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 28న నిర్వహించాల్సిన కౌన్సెలింగ్‌ను రద్దు చేస్తూ 26న నోటీస్ జారీ చేయడంపై మండిపడ్డారు. సింగరేణిలో డిప్యుటేషన్, ట్రాన్స్‌ఫర్ల దందా పెరిగిపోయిందని ఆరోపించారు. గెలుపొందిన ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ నాయకులు కార్మికుల నుంచి రూ.లక్షలు వసూలు చేస్తూ వారికి నచ్చినవారిని డిప్యుటేషన్, ట్రాన్స్‌ఫర్ చేయిస్తున్నారని అన్నారు. ఆర్జీ–2 యాజమాన్యం ఏఐటీయూసీ, టీబీజీకేఎస్‌లకు వత్తాసు పలుకుతూ కార్మికులకు నష్టం చేస్తోందని పేర్కొన్నారు. కౌన్సెలింగ్ రద్దుపై సింగరేణి యాజమాన్యం సమాధానం చెప్పాలన్నారు. ఎన్నికలు జరగకుండా చేయడంలో ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ నాయకుల పాత్ర ఉందన్నారు. అన్ని సంఘాలను సమానంగా చూడాలని కోరినా ఇప్పటివరకు దానిపై ఎలాంటి సర్క్యులర్ జారీ చేయలేదని తెలిపారు. సింగరేణి యాజమాన్యం వెంటనే అన్ని యూనియన్ల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి, పాత కమిటీలను రద్దు చేసి, నూతన కమిటీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు గోపాల్ రెడ్డి, దావు రమేశ్, అజీమ్, మల్లేశ్, లక్ష్మయ్య, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

'సింగరేణి ఎన్నికలను సర్కారు అడ్డుకుంటోంది'



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సత్తయ్య

కమాన్‌పూర్(రామగిరి): సింగరేణి ఎన్నికలు నిర్వహించకుండా రాష్ట్ర సర్కారు అడ్డుకుంటోందని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య ఆరోపించారు. ఆర్జీ–3 ఏరియాలోని ఏఎల్‌పీ వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. నాలుగేళ్లయినా ఇప్పటివరకు సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం అప్రజాస్వామిక పద్ధతిని అనుసరిస్తోందని మండిపడ్డారు. ఎన్నికలు నిర్వహించకపోవడంతో కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో గుర్తింపు సంఘం ఎలక్షన్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. సింగరేణికి వచ్చిన లాభాల్లో 35 శాతం వాటాను కార్మికులకు చెల్లించాలన్నారు. లేనిపక్షంలో బీఎంఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు అరుకాల ప్రసాద్, వై.సారంగపాణి, పొన్నమనేని వేణుగోపాలరావు, మాదాసు రవీందర్, మామిడి స్వామి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ కార్మికుల పెన్షన్ పెంచండి

- ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్



జనక్ ప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న రిటైర్డ్ కార్మికులు

గోదావరిఖని(రామగుండం): సింగరేణి రిటైర్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం జనక్ భవన్‌లో రిటైర్డ్ కార్మికులు ఆయనకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జనక్ ప్రసాద్ మాట్లాడుతూ.. పెన్షన్ పెంపు, సీపీఆర్‌ఎంఎస్ మెడికల్ స్కీం మెరుగుపర్చాలన్నారు. పెన్షన్‌పై ఇప్పటివరకు రివ్యూ చేయలేదని, టెక్నాలజీ, బొగ్గు ధరలు పెరుగుతున్న క్రమంలో రిటైర్డ్ కార్మికుల పెన్షన్ పెంచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ధర్మపురి, సదానందం, మల్లారెడ్డి, రాజన్న, మల్లయ్య, లాల్‌మహ్మద్, రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

బురద రోడ్డుపై నాటువేసి నిరసన



బురద రోడ్డుపై నాటు వేస్తున్న మహిళలు

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని ప్రశాంత్‌నగర్‌లో బురదమయమైన రోడ్డుపై కాలనీ మహిళలు మంగళవారం నాటువేసి, నిరసన తెలిపారు. ఈ దారిని రోడ్డంటారా సార్లూ... అంటూ పాలకులు, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆరు నెలల క్రితం యూజీడీ నిర్మించిన అధికారులు సుమారు 200 మీటర్ల వరకు రోడ్డు నిర్మాణం చేపట్టకుండా వదిలేశారని ఆరోపించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు దారి బురదగా మారిందని, 50 కుటుంబాలకు చెందినవారందరం ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేటర్, అధికారులకు విన్నవించినా సమస్యను పరిష్కరించడం లేదని వాపోయారు. ఇప్పటికైనా స్పందించి, సీసీ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మణెమ్మ, పోశం, శంకర్, మల్లయ్య, ఎల్లమ్మ, శారద, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఐరన్ స్క్రాప్ పట్టుకున్న ఆర్జీ–1 సిబ్బంది



పట్టుకున్న స్క్రాప్‌తో సెక్యూరిటీ సిబ్బంది

గోదావరిఖని(రామగుండం): సింగరేణి ఐరన్ స్క్రాప్‌ను ఆర్జీ–1 సెక్యూరిటీ సిబ్బంది సోమవారం రాత్రి పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు జీడీకే–7 ఎల్‌ఈపీ సమీపంలో తరలించేందుకు సిద్ధంగా ఉన్న 950 కిలోల స్క్రాప్‌ను పట్టుకున్నట్లు జూనియర్ ఇన్‌స్పెక్టర్ జె.ఉమేశ్ తెలిపారు. దాన్ని 18 మెగావాట్ల పవర్‌హౌస్‌లో భద్రపర్చినట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో జమేదార్ యాట ఓదెలు, ఎంటీఎఫ్ టీం, ఏసీటీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రీనగర్‌లో చోరీ



బీరువాను పరిశీలిస్తున్న ఎస్సై అశోక్‌రెడ్డి

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మున్సిపల్ పరిధి శాస్త్రీనగర్‌లోని ఓ కిరాణ దుకాణంలో చోరీ జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్త్యాల లక్ష్మి శాస్త్రీనగర్‌లో కిరాణ షాపు నిర్వహిస్తోంది. సోమవారం ఉదయం ఇంటికి తాళం వేసి, మంచిర్యాలలోని తన బంధువుల ఇంటికి వెళ్లింది. మంగళవారం ఉదయం ఆమె ఇంటి వెనక తలుపులు తీసి ఉండటంతో పక్కింటివారు ఫోన్ చేసి, విషయం చెప్పారు. లక్ష్మి ఇంటికి వచ్చి చూడగా లోపల వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలోని 4 తులాల వెండి, పట్టు చీరలు, కిరాణంలోని సరుకులు ఎత్తుకెళ్లారని బాధితురాలు తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజేందర్ పేర్కొన్నారు.